సాక్షి శ్రీకాకుళం

మంగళవారం । 24 । జనవరి । 2023



ప్రయోగాల వేళ..!

ఫిబ్రవరి 26 నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్ ప్రారంభం కానున్నాయి. అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. - 8లో



యాంత్రీకరణపై అవగాహన

యాంత్రీకరణపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. ఆమదాలవలస కేవీకేలో ఈ కార్యక్రమం జరిగింది. - 8లో

27 నుంచి డిగ్రీ మొదటి సెమిస్టర్ ప్రయోగ పరీక్షలు

ఎచ్చెర్ల క్యాంపస్: ఈ నెల 27 నుంచి ఫిబ్రవరి 1 వరకు డిగ్రీ మొదటి సెమిస్టర్ ప్రయోగ పరీక్షలు నిర్వహించనున్నట్లు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం ఎగ్జామినేషన్స్ డీన్ డాక్టర్ ఎస్.ఉదయ్‌భాస్కర్ చెప్పారు. థియరీ పరీక్షలు ఫిబ్రవరి ఏడు నుంచి ప్రారంభమవుతాయని అన్నారు.

న్యూస్‌రీల్

మూడో స్నాతకోత్సవం నిర్వహణకు చర్యలు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాయం మూడో స్నాతకోత్సవం నిర్వహణకు చర్యలు చేపడుతున్నట్లు రిజిస్ట్రార్ సీహెచ్ ఏ రాజేంద్రప్రసాద్ తెలిపారు. వర్సిటీలోని రిజిస్ట్రార్ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడారు. స్నాతకోత్సవం నిర్వహణకు పాలక మండలి అనుమతి తీసుకున్నామని, రాష్ట్ర గవర్నర్ అనుమతి కోరినట్లు చెప్పారు. ఆయన సూచనల మేరకు స్నాతకోత్సవ నిర్వహణ తేదీ ప్రకటిస్తామని అన్నారు. వర్సిటీలో ఇంజినీరింగ్ 5, 7 సెమిస్టర్ పరీక్షలు మంగళవారం నుంచి ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఫిబ్రవరి ఆరు వరకు ఈ పరీక్షలు జరుగుతాయని అన్నారు. వర్సిటీలో అకడమిక్ క్లాస్‌వర్క్‌పై దృష్టి సారిస్తున్నట్లు చెప్పారు. ఫేస్ రికగ్నేషన్ సిస్టం వర్సిటీ, వర్సిటీ అఫిలియేషన్ కళాశాలల్లో విద్యార్థులకు, బోధన, బోధనేతర సిబ్బందికి అమలు చేయనున్నట్లు తెలిపారు. భవిష్యత్‌లో విద్యార్థులకు చెల్లించే జగనన్న విద్యా దీవెన, జగనన్న వసతి దీవెన పథకాలు అమలు సైతం ఎఫ్ఆర్ఎస్ ఆధారంగా చెల్లించనున్నట్లు వివరించారు.

బాలికపై లైంగిక దాడి కేసులో ఇద్దరికి 20 ఏళ్ల జైలు శిక్ష

శ్రీకాకుళం పాతబస్టాండ్: బాలికపై లైంగికదాడికి పాల్పడిన కేసులో దోషులైన ఇద్దరికి 20 ఏళ్ల చొప్పున జైలు శిక్ష విధిస్తూ కోర్టు తీర్పునిచ్చింది. జి.సిగడాం మండలానికి చెందిన లుట్ట అనిల్ కుమార్ (ఎ1), పమోటి రవికుమార్ (ఎ2)లకు జైలు శిక్షతో పాటు బాలికకు పరిహారం కింద ఒకటో ముద్దాయికి రూ.లక్ష, రెండో ముద్దాయికి రూ.2 లక్షలు జరిమానా విధించింది. శ్రీకాకుళం ప్రత్యేక ట్రిబ్యునల్ కోర్టు, పోక్సో కోర్టు న్యాయమూర్తి కె.శ్రీదేవి సోమవారం ఈ తీర్పునిచ్చారు. 2020 డిసెంబర్‌లో వీరిపై జి.సిగడాం మండలం భీమవరం గ్రామానికి చెందిన ఓ మహిళ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాలికను భయపెట్టి లొంగదీసుకున్నారని, గర్భవతిని కూడా చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆపై వారి నేరం రుజువు కావడంతో జడ్జి పైన పేర్కొన్న విధంగా తీర్పునిచ్చారు. ఈ కేసును దిశ డీఎస్పీ వాసుదేవ్ దర్యాప్తు చేయగా, ప్రభుత్వ న్యాయవాది పి.వెంకటరమణారావు వాదించారు.

జాతీయ స్థాయి పోటీలకు నందిగాం విద్యార్థులు



జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో నందిగాం ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు

నందిగాం: శ్రీకాకుళం ఆర్ట్స్ కాలేజీ మైదానంలో జరిగిన రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ పోటీల్లో నందిగాం ఉన్నత పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు హర్నాగుల హరిబాబు తెలిపారు. పాఠశాలకు చెందిన జి.అభిరాం, అండర్ 14 బాలుర విభాగంలో 400, 600 మీటర్ల పరుగుపందెంలో రెండు బంగారు పతకాలు, రిలే పోటీలో వెండి పతకం సాధించగా, బి.మోక్ష అండర్ 17 విభాగంలో 1500, 3000 మీటర్ల పరుగు పందెంలో రెండు బంగారు పతకాలు సాధించారు. దీంతో విద్యార్థులతో పాటు పీడీ శ్రీనివాసరావును, కోచ్ బి.వెంకటరావును ఉపాధ్యాయ సిబ్బంది, గ్రామ పెద్దలు అభినందించారు.

కలెక్టర్‌కు రూ.25 లక్షల చెక్కు అందజేత

శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రధాన మంత్రి టీబీ ముక్త భారత్ అభియాన్ కింద డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ వారు జిల్లాలో 595 మంది టీబీ వ్యాధిగ్రస్తుల ఫుడ్ బాస్కెట్ కోసం నెలకు రూ.700చొప్పున ఆరు నెలల పాటు అందించేందుకు రూ.25 లక్షల చెక్కును జిల్లా టీబీ కంట్రోల్ అధికారి డాక్టర్ అనురాధ.. కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్‌కు స్పందన కార్యక్రమంలో అందజేశారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, జిల్లా రెవెన్యూ అధికారి రాజేశ్వరి, డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ బి.సురేష్, మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ కిరణ్, జిల్లా పరిషత్ సీఈఓ వెంకట్ రామన్, నీటియాజమాన్య సంస్థ పథక సంచాలకులు జీవీ చిట్టిరాజు తదితరులు పాల్గొన్నారు.

దేవదాయశాఖ అధికారి బాధ్యతల స్వీకరణ

అరసవల్లి: జిల్లా దేవదాయశాఖ అధికారిగా బి.హరిసూర్యప్రకాష్ సోమవారం పూర్తి అదనపు బాధ్యతలు స్వీకరించారు. ఆయన అరసవల్లి ఈఓగానూ కొనసాగుతున్నారు. ఆయనకు సూపరింటెండెంట్ ప్రసాద్‌పట్నాయక్‌తోపాటు వివిధ ఆలయాల ఈఓలు అభినందనలు తెలియజేశారు.

● గూడు అల్లెను చూడు



స్పైడర్ తన ఇల్లు కట్టుకోవడంలో ఇలా బిజీగా ఉంది. తొలి సూర్యకిరణాలు తాకే సమయంలో తులసి చెట్టుపై ఇలా పర్ఫెక్ట్ ప్లాన్‌తో తన గూడును నిర్మించుకుంటోంది. ఈ దృశ్యం చీమలవలసలో సాక్షి కెమెరాకు చిక్కింది. – ఆమదాలవలస రూరల్

రంగం ఏదైనా.. బాలికే ఏలిక!

- వలు రంగాల్లో రాణిస్తున్న బాలికలు
- నేడు జాతీయ బాలికా దినోత్సవం

అడుగు తీసి అడుగు వేస్తే సవాలక్ష ఆంక్షలు. 'గర్భ' గుడి దాటింది మొదలు.. అడుగడుగునా సంకెళ్లు. అమ్మవారి అంశ అంటూనే గడప దాటనీయని మనస్తత్వాలు. లోకమంతా మనిషి తోలు కప్పుకున్న మృగాళ్లు.. ఇన్ని అవరోధాల నడుమ సిక్కోలు బాలిక సీతాకోకచిలుకలా స్వేచ్ఛగా విహరిస్తోంది. తల వంచుకుని తిరిగే స్థితిగతులను మార్చి తల్లిదండ్రులు తలెత్తి గర్వపడి చూసే స్థాయికి ఎదుగుతోంది. క్రీడలు, విద్య, సృజనాత్మకత వంటి రంగాల్లో మన బాలికలు భళా అనిపిస్తున్నారు. ఈ రోజుల్లో కూడా అడ్డుగోడల నడుమ ఘడియలు లెక్క పెడుతున్న వారికి ప్రపంచం మనదేనంటూ ధైర్యాన్నిస్తున్నారు.

– ఇచ్ఛాపురం రూరల్



సోంపేట: బాలికల దినోత్సవం సందర్భంగా సంస్కారభారతి విద్యార్థుల ప్రదర్శన

● అడుగేస్తే అవార్డు..



భరతనాట్యం చేస్తున్న భవానీ

చిరు ప్రాయంలోనే నాట్య రంగంలో ప్రవేశించి రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది బాగ భవానీ. ఇచ్ఛాపురం మండలం అయ్యవారిపేటకు చెందిన భవానీ 13 ఏళ్ల వయసులో స్వేచ్ఛా నృత్య తరంగణి నాట్య శిక్షణాలయంలో కూచిపూడి, భరత నాట్యం, జానపద నృత్య పోటీల్లో పాల్గొని వందకు పైగా ప్రదర్శనలు ఇచ్చి శభాష్ అనిపించుకుంది. ప్రస్తుతం ఇంటర్ చదువుతున్న భవానీ 2018లో తమిళనాడు మధురైలో జరిగిన నృత్య పోటీల్లో 'నృత్య మీనాక్షి' అవార్డును పొందింది. 2022లో హైదరాబాద్‌లో అక్షయ సోషల్ కల్చరల్ అసోషియేషన్ వారు నిర్వహించిన పోటీలో 'నాట్య సరస్వతి' అవార్డును, 2022 డిసెంబర్ 10న శ్రీశైలంలో జరిగిన సంగీత కళ నృత్య సాంస్కృతిక పోటీలో పాల్గొని 'నంది అవార్డు'ను కైవసం చేసుకుంది. అలాగే 2022 డిసెంబర్‌లో వారణాసిలో జరిగిన 75వ అమృత్ మహోత్సవ్, ఉత్తర ప్రదేశ్‌లో జరిగిన నృత్య పోటీల్లో పాల్గొని ఏసీపీ ప్రవీణ్ కుమార్ చేతులు మీదుగా సిల్వర్ మెడల్, బహుమతులు గెల్చుకుంది. నృత్య తరంగణి అకాడమీ అధ్యక్షులు కె.గోవిందరావు, గురువు మంగి దివ్య సారథ్యంలో మరింత శిక్షణ తీసుకుంటోంది.



● కొడితే పతకమే..



కరాటే సాధనలో మాధవీశెట్టి

కరాటే వంటి పోటీల్లో బాలికలు కూడా బాలురతో సమానంగా పోటీ పడుతున్నారు. ఆంధ్రా-ఒడిశా సరిహద్దు లక్ష్మీపురం మత్స్యకార గ్రామానికి చెందిన మాధవీ శెట్టి ఈదుపురం ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతోంది. మహిళలు అత్యవసర సమయంలో తమను తాము కాపాడుకోవడానికి, ఆత్మ రక్షణకు కరాటే విద్య ఎంతో ఉపయోగపడుతుందన్న తల్లిదండ్రుల మాటలకు ఫిదా అయిపోయిన మాధవి స్నేహితులు వారిస్తున్నప్పటికీ ఒడిశా పాటి సున్నాపురానికి చెందిన మాస్టర్ తాయ్ ప్రకాశ్ దగ్గర కరాటే నేర్చుకుంది. కటా విభాగంలో జాతీయ స్థాయిలో జూలై 2022లో ఒడిశా గిరిసాలలో జరిగిన సౌత్‌జోన్ ఎల్లో బెల్ట్ చాంపియన్‌షిప్ పోటీలో గోల్డ్ మెడల్ సాధించింది. 2022లో రాష్ట్రస్థాయిలో కరాటే అండ్ కుంగ్‌ఫూ చాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొని బంగారు బహుమతి పొందింది. ఒడిశాలో జరిగిన 3వ ఇంటర్ డోజో కరాటే ఛాంపియన్-2022 సెప్టెంబర్‌లో జరిగిన పోటీలో పాల్గొని ప్రథమ స్థానంలో నిలిచింది. విశాఖపట్నంలో జరిగిన సౌత్ ఇండియా కరాటే ఛాంపియన్ షిప్-2022 పోటీలో పాల్గొని ద్వితీయ స్థానం సాధించింది.

ఆటో బోల్తా: 9 మంది విద్యార్థులకు గాయాలు



గాయపడిన సూర్య స్కూల్ విద్యార్థి



గాయపడిన ఆదర్శ పాఠశాల విద్యార్థి

రణస్థలం: మండలంలోని కొండములగాం సమీపంలో ఆటో బోల్తా పడి తొమ్మిది మంది విద్యార్థులకు గాయాలయ్యాయి. జేఆర్ పురం పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. మండలంలోని ఆదర్శపాఠశాల, సూర్య ప్రైవేటు పాఠశాలలకు చెందిన ఏడుగురు విద్యార్థులు వెల్బురాయి గ్రామం నుంచి ఉదయం 8గంటల సమయంలో ఆటోలో బయల్దేరారు. బంటుపల్లి పంచాయతీలో గల నుడుకుదిపాలెం గ్రామానికి చెందిన ఇద్దరు విద్యార్థులు మధ్యలో ఎక్కారు. ఈ ఆటో కొండములగాం ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్దకు ఉదయం 8.45 నిమిషాల సమయంలో వచ్చే సరికి రెండు కుక్కలు అడ్డంగా రావడంతో ఆటో డ్రైవర్ సురేష్ సడన్ బ్రేక్ వేయడంతో బండి బోల్తా పడిపోయింది. వెంటనే స్థానికులు స్పందించి ఆటోలో ఇరుక్కున్న వారిని రక్షించి 108కు సమాచారం అందించారు. వారు వచ్చి క్షతగాత్రులను రణస్థలం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ఇందులో నలుగురు విద్యార్థులను మెరుగైన చికిత్స కోసం శ్రీకాకుళం సర్వజన ఆస్పత్రికి తరలించారు. విద్యార్థులకు చిన్న చిన్న దెబ్బలే తగలడంతో తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు. గాయపడిన వారిలో ఎం.వరుణ్ చౌదరి, శ్రావణి, ఎ.భైరవ్, గిరీష్‌తో పాటు మరో ఐదుగురు విద్యార్థులు ఉన్నారు. ఆదర్శ పాఠశాల విద్యార్థులు ముగ్గురు, సూర్య స్కూల్ విద్యార్థులు ఆరుగురు ఆటో ఉన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు జేఆర్ పురం ఎస్ఐ జి.రాజేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. గాయపడిన విద్యార్థులను వైఎస్సార్‌సీపీ నాయకులు పిన్నింటి సాయికుమార్, కెల్ల రామకృష్ణ, గురాన ప్రసాద్‌తో పాటు పలువురు నాయకులు పరామర్శించారు.



గాయపడిన విద్యార్థులను పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ట్రాక్టర్‌ను ఢీకొన్న బైక్

మాకవరపాలెం (అనకాపల్లి జిల్లా) : బైక్ ట్రాక్టర్‌ను ఢీకొట్టిన ప్రమాదంలో ఇంజినీరింగ్ విద్యార్థి మృతి చెందగా ఇద్దరు గాయపడ్డారు. ఆదివారం రాత్రి జరిగిన ఈ ప్రమాదానికి సంబంధించి పోలీసులు అందించిన వివరాలు.. తూర్పుగోదావరి జిల్లా రాజోలు మండలం పొదలాడకు చెందిన లంకె తరుణ్‌బాబు, సింగిరెడ్డి దినేష్(విజయనగరం), రావాడ లోకేష్(శ్రీకాకుళం)లు మండలంలోని తామరం అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ నాలుగో సంవత్సరం విద్యార్థులు. వీరంతా కళాశాల హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటున్నారు. అయితే ఆదివారం రాత్రి మోటారు సైకిల్‌పై నర్సీపట్నం వెళ్లిన వీరు తిరిగి వస్తుండగా రాచపల్లి జంక్షన్ సమీపంలో కామేశ్వరమ్మ ఆలయం వద్దకు వచ్చేసరికి ఎదురుగా వస్తున్న ట్రాక్టర్‌ను ఢీ కొట్టారు. దీంతో తరుణ్‌బాబు అక్కడికక్కడే మృతి చెందగా, దినేష్ తీవ్రంగా, లోకేష్ స్వల్పంగా గాయపడ్డారు. వెంటనే క్షతగాత్రులను నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. అపస్మారక స్థితిలో ఉన్న దినేష్‌ను విశాఖ తరలించారు. ఈ సంఘటనలో బైక్ నుజ్జునుజ్జయింది. కొద్ది నిమిషాల వ్యవధిలోనే హాస్టల్‌కు చేరుకోవాల్సిన తరుణ్ మృతి చెందడంతో తోటి విద్యార్థులు కన్నీరు మున్నీరుగా విలపించారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేశామని ఎస్ఐ రామకృష్ణారావు తెలిపారు.

39 నిమిషాల్లో ఆరోగ్యశ్రీ కార్డు

- రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తికి ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్స
- హర్షం వ్యక్తం చేసిన స్థానికులు


ఆరోగ్య శ్రీ.. వేలాది ప్రాణాలకు కావలా. లక్షలాది మంది సామాన్యులకు సంజీవని. వైఎస్సార్ నుంచి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వరకు అందరికీ మానస పుత్రిక. ఈ పథకం ఎందుకంత కీర్తి సంపాదించిందో మరో మారు నిరూపితమైంది. దీంతో పాటు ప్రభుత్వ చిత్తశుద్ధి కూడా అందరికీ తెలిసింది.

–ఇచ్ఛాపురం రూరల్



రోడ్డు ప్రమాదంలో గాయపడిన సింహాచలం

ఇచ్ఛాపురం పట్టణం ఫకీరుపేట వార్డు సచివాలయానికి చెందిన వలంటీర్ వర్రి సింహాచలం సోమవారం ద్విచక్ర వాహనంపై జాతీయ రహదారిపై వెళ్తుండగా, మందస హైవేపై రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు, కుటుంబ సభ్యులు సింహాచలంను విశాఖపట్నంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. సింహాచలంకు అంతవరకు ఆరోగ్యశ్రీ కార్డు లేకపోవడంతో ఉచితంగా చికిత్స చేయడం కుదరలేదు. అసలే వారిది పేద కుటుంబం.. సమయానికి చేతిలో డబ్బు లేకపోవడంతో బాధితుడి బంధువులు ఈ విషయాన్ని సీడాప్ చైర్మన్ సాడి శ్యామ్‌ప్రసాద్ రెడ్డి దృష్టికి తెచ్చారు. ఆయన తక్షణమే స్పందించి బాధితుని వివరాలు నమోదు చేసుకుని వైఎస్సార్ ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ అడిషనల్ సీఈఓకు ఫోన్ చేసి వివరాలు చెప్పారు. వెంటనే హెల్త్ కార్డు మంజూరు చేయాలనికోరారు. మధ్యాహ్నం 1.53కు ఆయన ఫోన్ చేస్తే కేవలం 39నిమిషాల్లో అంటే మధ్యాహ్నం 2.32కు ఆరోగ్య శ్రీ కార్డు రెడీ అయిపోయింది. ఆ కార్డు సాయంతో సింహాచలంకు సకాలంలో ఉచితంగానే కార్పొరేట్ వైద్యం చేయగలిగారు. సకాలంలో స్పందించి తమకు సాయం చేసిన ప్రభుత్వానికి సింహాచలం కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. 'వైఎస్సార్ ఆరోగ్యశ్రీ' పథకం పేదలకు సంజీవని అని కొనియాడారు.



39 నిమిషాల్లో మంజూరైన ఆరోగ్యశ్రీ కార్డు

ధాన్యం సేకరణలో జిల్లా అ'ద్వితీయం'

- 3 నెలల్లో 2కోట్ల మందికి ఉపాధి కల్పించాలి
- రబీ ఈ-క్రాప్ బుకింగ్ వేగవంతం చేయాలి
- కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: ధాన్యం సేకరణలో జిల్లా 3.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించి రాష్ట్రంలోనే ద్వితీయ స్థానంలో నిలిచిందని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ పేర్కొన్నారు. జిల్లాలో రీ సర్వే మరింత వేగవంతం కావాల్సి ఉందని దీనిపై తహసీల్దార్లు, ఉప తహసీల్దార్లు దృష్టి సారించాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ మండల అధికారులను ఆదేశించారు. ఆయన సోమవారం కలెక్టర్ కార్యాలయంలో ఆర్డీఓలు, మండల ప్రత్యేక అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ప్రగతి పనులపై సమీక్షించారు. జిల్లాలో ఫిబ్రవరి మాసాంతానికి 221 గ్రామాల్లో రీసర్వే పూర్తిచేయాల్సి ఉండగా, ఇప్పటివరకు 80 గ్రామాల్లో మాత్రమే రీసర్వే పూర్తయిందన్నారు. దీనిపై దృష్టి సారించాలన్నారు. రబీ ఈ-క్రాప్ బుకింగ్‌లో జిల్లా వెనుకంజలో ఉందని, 25 శాతం వరకు ఈకేవైసీ కాలేదని, పెండింగ్ ఉన్న రైతుల వివరాలను సచివాలయల్లో ప్రదర్శించాలన్నారు.

- సోంపేట, పలాస, మందస, నందిగాం, హిర మండలం తదితర మండలాల్లో ట్రక్ షీట్ జనరేట్ కాలేదని, తద్వారా రైతుల నుంచి ధాన్యం తీసుకోవడం లేదనే ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. వేరే మిల్లుకు పంపే వీలుందని చెప్పాలని, ఖర్చు ప్రభుత్వమే భరిస్తుందనే విషయాన్ని వివరించాలన్నారు.
- జిల్లాలో స్టోన్ ప్లాంటేషన్ మరింత వేగవంతం కావాలన్నారు. ఇప్పటివరకు స్టోన్ ప్లాంటేషన్ పూర్తిచేసిన వాటికి చెల్లించాల్సిన రూ.20లక్షలు చెల్లించడం జరిగిందని చెప్పారు.
- గడపగడపకూ మన ప్రభుత్వం (జీజీఎంపీ) పనుల్లో సరైన అవగాహన లేనందున ఎచ్చెర్ల ఎంపీడీఓకు షోకాజ్ నోటీస్ జారీచేయాలని కలెక్టర్ జిల్లా పరిషత్ సీఈఓనుఆదేశించారు. ప్రతి మండలానికి రూ.20 లక్షల పనులను చేపట్టాల్సి ఉండగా ఇప్పటివరకు ఒక కోటి రూపాయల పనులు మాత్రమే జరుగుతున్నాయని కలెక్టర్ పేర్కొన్నారు.
- స్వచ్ఛ సంకల్పం కింద జిల్లాలో 628 షెడ్లు పూర్తయ్యాయని, వాటిలో 518 షెడ్లు వినియోగంలో ఉన్నాయన్నారు. మిగిలిన 110 షెడ్లు వినియోగంలోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.
- జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద రోజుకు రూ.250లు వేతనం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. రోజుకు లక్ష మందికి పని కల్పించాలనే లక్ష్యాన్ని అందుకోవాలన్నారు.
- స్పందనలో వచ్చే ఫిర్యాదులపై లబ్ధిదారుల ఫొటోలను అప్‌లోడ్ చేయాలని, కచ్చితమైన గడువుతో సమాచారాన్ని అందజేయాలని తెలిపారు.

కలెక్టర్ స్పందనకు 259 వినతులు



స్పందనలో వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, జేసీ నవీన్ ఇతర అధికారులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా కేంద్రంలోని జెడ్పీ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందనకు 259 వినతులు అందాయి. కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ ఎం. నవీన్, జిల్లా రెవెన్యూ అధికారి రాజేశ్వరి, డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ విద్యాసాగర్ వినతులు స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ స్పందనలో నమోదైన ఫిర్యాదు లు తప్పనిసరిగా పరిష్కరించాలని సూచించారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరం ఆవరణలో సోమవారం ఆధార్ అప్‌డేషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ మాట్లాడుతూ 2016 సంవత్సరానికి ముందు ఆధార్ కార్డు చేయించుకున్న వారు కార్డులో చిరునామా, ఫొటో, సెల్ నంబర్ ఇతర ఏమైనా మార్పులు ఉంటే సంబంధిత ధ్రువీకరణ పత్రాలు అందించి ఆధార్ అప్‌డేషన్ చేయించుకోవాలని సూచించారు.

ఎస్పీ స్పందనకు 31 అర్జీలు

శ్రీకాకుళం క్రైమ్ : స్పందనలో వచ్చే ప్రతీ అర్జీపై ప్రత్యేక శ్రద్ధ వహించి సమస్యలు పరిష్కరించాలని ఎస్పీ జీఆర్ రాధిక పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో 31 అర్జీలు స్వీకరించారు. ఎస్పీతో పాటు అదనపు ఎస్పీ టీపీ విఠలేశ్వరరావు ఫిర్యాదుదారుల నుంచి అర్జీలను స్వీకరించారు.



సమస్యను వింటున్న ఎస్పీ రాధిక

క్లుప్తంగా

నిత్యాన్నదానానికి రూ. లక్ష విరాళం



ఈవోకు విరాళాన్ని అందజేస్తున్న దృశ్యం

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో శాశ్వత అన్నదాన పథకానికి నరసన్నపేటకు చెందిన వి.విజయకుమారి కుటుంబ సభ్యులు ఒక లక్ష ఐదు రూపాయలను విరాళంగా ప్రకటించారు. ఈ మొత్తాన్ని ఆలయ ఈవో వి.హరిసూర్యప్రకాష్‌కు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ.. ఈ నెల 26వ తేదీ సాయంత్రంలోగా రూ. లక్ష లేదా అంతకుమించి విరాళాలు ఇచ్చిన వారికి డోనర్ పాస్‌లు అందజేస్తామని ప్రకటించారు.

గొర్రెల పెంపకందారుల సంఘ ఎన్నికలు నిర్వహించాలి



మాట్లాడుతున్న సంఘ నాయకులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో గొర్రెలు, మేకల పెంపకందారుల సహకార సంఘ ఎన్నికలు నిర్వహించాలని అధ్యక్షుడు బూర పాపారావు కోరారు. పశు సంవర్ధక శాఖ జేడీ ఎన్నికల ప్రక్రియను చేపట్టాల్సి ఉండగా జాప్యం చేస్తున్నారన్నారు. ఈ మేరకు సోమవారం జిల్లా పరిషత్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమం వద్ద నిరసన తెలియజేశారు. జిల్లా వ్యాప్తంగా 137 సంఘాలు ఉండగా.. వీటి గడువు ముగిసిందన్నారు. ఎన్నికలు నిర్వహించాలని జేడీని కలిసి విన్నవించుకున్నప్పటికీ చర్యల్లేవన్నారు. ఎన్నికలు జరిగేలా చూడాలని కోరుతూ జిల్లా కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్‌కి వినతి పత్రం అందజేశారు.

టోల్ ప్లాజా కార్మికులను పనిలోకి తీసుకోవాలి

● కలెక్టర్‌కు విజ్ఞప్తి



కార్మికులకు న్యాయం చేయాలని నినాదాలు చేస్తున్న అఖిలపక్ష నాయకులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: చిలకపాలెం టోల్ ప్లాజా కార్మికులను పనిలోకి తీసుకొని వారికి న్యాయం చేయాలని అఖిలపక్ష నాయకులు కోరారు. టోల్‌ప్లాజాను ఎత్తివేయడంతో ఇక్కడ పని చేసిన కార్మికులు రోడ్డున పడ్డారన్నారు. వీరిని వేరే చోట సర్దుబాటు చేయాలని కోరుతూ సోమవారం జరిగిన స్పందనలో జిల్లా కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా టీటీపీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్, సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బి.కష్ణమూర్తి, జనసేన పార్టీ నాయకులు పేడాడ రామ్మోహనరావు, బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు జి.రామప్పడు మాట్లాడుతూ.. చిలకపాలెం టోల్ ప్లాజా మూసివేసినప్పటికీ ఆదాయం తగ్గకుండా మడపాం, నాతవలస టోల్ ప్లాజాల్లో టోల్ రుసుం పెంచి నట్టే.. ఇక్కడి కార్మికులను కూడా సర్దుబాటు చేయాలని డిమాండ్ చేశారు. 15 సంవత్సరాలుగా పనిచేసిన 106 మంది కార్మికులను రోడ్డున పడేయడం అన్యాయమన్నారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో మాజీ సైనికుల అసోసియేషన్ ప్రతినిధి సనపల రామారావు, చిలకపాలెం టోల్ ప్లాజా ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి డి.వి.నర్సింహులు, నాయకులు ఎం.శంకరనారాయణ, ఎ.వి.ఆర్.మూర్తి ఉన్నారు. అలాగే జిల్లా రెవెన్యూ అధికారి ఎం రాజేశ్వరిని పొందూరు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కలిశెట్టి అప్పలనాయుడు కలిసి ఎచ్చెర్ల నియోజకవర్గంలోని పలు సమస్యలపై వినతి పత్రాన్ని అందజేశారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	54,930-00
బంగారం(22సి. 10గ్రా.)	50,350-00
వెండి (కిలో)	74,500-00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 547.00
విజయనగరం	రూ. 551.00
శ్రీకాకుళం	రూ. 551.00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹120	₹195	₹ 215

ప్రయోగాల వేళ..

- ఫిబ్రవరి 26 నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్
- ఏర్పాట్లలో అధికారులు
- హాజరుకానున్న 19,471 మంది విద్యార్థులు
- 140 కేంద్రాల కేటాయింపు



ప్రాక్టికల్స్‌లో నిమగ్నమైన విద్యార్థులు

శ్రీకాకుళం న్యూకాలనీ: విద్యార్థులకు పరీక్ష సీజన్ సమీపిస్తోంది. ముందుగా ఇంటర్మీడియెట్ విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ప్రాక్టికల్ పరీక్షలను థియరీ పబ్లిక్ పరీక్షల తర్వాత ఏప్రిల్ 15 నుంచి మే పదో తేదీ వరకు నిర్వహించాలని ఇంటర్మీడియెట్ బోర్డు అధికారులు భావించారు. అయితే మే నెల వరకు ప్రాక్టికల్ పరీక్షలు ఉంటే ఎంసెట్ తదితర పోటీ పరీక్షలకు సమయం సరిపోదని విద్యార్థులు, తల్లిదండ్రుల విజ్ఞప్తుల నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇంటర్‌బోర్డు షెడ్యూల్‌లో మార్పులు చేసింది.

థియరీ పరీక్షకు ముందేగానే..

థియరీ పరీక్షలకు ముందుగానే ప్రాక్టికల్స్‌ను నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఫిబ్రవరి 26 నుంచి మార్చి ఏడో తేదీ వరకు ప్రాక్టికల్ పరీక్షలను నిర్వహించేలా అధికారులు షెడ్యూల్ ఖరారు చేశారు. నాన్‌జంబ్లింగ్ విధానంలో జరిగే ఈ పరీక్షల కోసం జిల్లా వ్యాప్తంగా 140 కేంద్రాలను కేటాయించారు. ఏర్పాట్లలో అధికారులు నిమగ్నమయ్యారు. కేంద్రాల్లో ప్రాక్టికల్ పరికరాలతోపాటు వసతుల కల్పన, మౌలిక సదుపాయాల తీరును నిశితంగా పరిశీలిస్తున్నారు. మరోపక్క కళాశాలల్లో ఎంపీసీ, బైపీసీ విద్యార్థులకు ప్రాక్టికల్స్ నిర్వహణలో లెక్చరర్లు బిజీగా ఉన్నారు.

జిల్లాలో ఇదీ పరిస్థితి..

జిల్లాలోని 30 మండలాల్లో అన్ని యాజమాన్యాల జూనియర్ కళాశాలలు 191 ఉండగా.. వీటిలో ఫంక్షనింగ్ జరుగుతున్నవి 166 ఉన్నాయి. ఇందులో ప్రభుత్వ కళాశాలలు 38, సోషల్‌వెల్ఫేర్ 9, ట్రైబల్ వెల్ఫేర్ 1, మోడల్‌స్కూల్/కళాశాలలు 13, కేజీబీవీలు 25, జెడ్పీహెచ్‌స్కూల్ కాలేజీలు 5, కోపరేటివ్ 2, ప్రైవేటువి 73 ఉన్నాయి.

ప్రాక్టికల్స్‌కు 19,471 మంది

ప్రాక్టికల్స్ పరీక్షల కోసం 19,471 మంది విద్యార్థులు సన్నద్ధమౌతున్నారు. వీరిలో ఎంపీసీ గ్రూపు నుంచి 13,165, బైపీసీ నుంచి 6,306 మంది విద్యార్థులు ఉన్నారు.

పకడ్బందీగా ఏర్పాట్లు



ప్రాక్టికల్ పరీక్షల కోసం పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నాం. తొలుత థియరీ పరీక్షల తర్వాత ప్రాకికల్స్ నిర్వహించాలని ఇంటర్మీడియెట్ బోర్డు భావించినప్పటికీ తరువాత షెడ్యూల్‌లో మార్పులు చేసింది. ఫిబ్రవరి 26 నుంచి 140 కేంద్రాల్లో నాన్ జంబ్లింగ్ విధానంలో ప్రాక్టికల్స్ జరుగుతాయి. కేంద్రాల్లో వసతులు, సదుపాయాలను తనిఖీలు చేస్తున్నాం.

– ఎస్.తవిటినాయుడు, జిల్లా ఆర్ఐవో, శ్రీకాకుళం

లోక్ అదాలత్‌లో కేసులు రాజీ చేయండి



మాట్లాడుతున్న సన్యాసినాయుడు

శ్రీకాకుళం పాతబస్టాండ్: మధ్యవర్తిత్వ విధానంలో అవార్డులు పాసైన కేసుల (ఆర్బిటరేషన్ కేసులు)ను లోక్ అదాలత్‌లో రాజీ అయ్యేలా కృషి చేయాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. కోర్టులోని న్యాయసదన్‌లో సోమవారం శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్, శ్రీరామ్ ట్రాన్స్‌పోర్టు ఫైనాన్స్ లిమిటెట్ లీగల్ అధికారులు, స్టాండింగ్ కౌన్సిల్ మంచు జనార్దన్, వివిధ ఫైనాన్స్ కంపెనీల ప్రతినిధులతో మాట్లాడారు. రాజీకి అనుకూలమున్న కేసులను ఫిబ్రవరి 11వ తేదీన జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ సంఖ్యలో రాజీ చేయడానికి అందరూ కృషి చేయాలన్నారు. ఆర్బిటేషన్ ద్వారా అవార్డులు పాసైన కేసులు లోక్ అదాలత్‌లో రాజీ అవ్వడానికి ఎక్కువ అవకాశం ఉంటుందన్నారు. కేసుల రాజీకి కృషి చేస్తామని ఫైనాన్స్ కంపెనీల ప్రతినిధులు చెప్పారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ



విధులు బహిష్కరించి బయటకు వస్తున్న న్యాయవాదులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: న్యాయవాదులపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ జిల్లా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు కోర్టు విధులను సోమవారం బహిష్కరించారు. కాకినాడలో ప్రాక్టీసులో ఉన్న న్యాయవాది పైడి అన్నపూర్ణ వ్యక్తిగత పనులపై స్వగ్రామం శ్రీకాకుళం జిల్లా వంజంగి రాగా.. ముసుగు వేసుకున్న కొంతమంది ఆమెపై దాడికి పాల్పడడం తగదన్నారు. దీనికి నిరసనగా విధులు బహిష్కరించినట్టు న్యాయవాదులు తెలిపారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బెజ్జిపురం ఫాల్గుణరావు, సీనియర్ అడ్వకేట్లు జల్లు తిరుపతిరావు, పి.వి.రమణదయాల్, ప్రభుత్వ న్యాయవాది పి.వి.రమణారావు, కూన అన్నం నాయుడు, బీసీ న్యాయవాదుల సంఘం జిల్లా అధ్యక్షుడు అగూరి ఉమామహేశ్వరరావు, ఎస్.తవిటినాయుడు, ఎ.కృష్ణరాజు, ఎ.ఎస్.ఆర్.సూర్యకళ, శ్రీదేవి, మీరాబాయ్, సంధ్య, సుజాత ఉన్నారు.

రథసప్తమి సందర్భంగా ట్రాఫిక్ క్రమబద్ధీకరణ

● జిల్లా ఎస్పీ జి.ఆర్.రాధిక



అధికారులతో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైమ్: రథసప్తమి వేడుక సందర్భంగా భక్తులకు, ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా శ్రీకాకుళం పట్టణంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులకు జిల్లా ఎస్పీ జి.ఆర్.రాధిక ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు సోమవారం సాయంత్రం పట్టణంలోని ముఖ్య కూడళ్లను పరిశీలించారు. అరసవల్లి, 80 అడుగుల రహదారి, సూర్యమహాల్, ఆర్చి కూడళ్లలో ట్రాఫిక్ మళ్లింపు, నియంత్రణ చర్యలపై అధికారులతో చర్చించారు. వాహనాల పార్కింగ్ కోసం ప్రత్యేక స్థలాలను కేటాయించి క్రమపద్ధతిలో పెట్టేలా చూడాలని సూచించారు. ఆయా కూడళ్లలో అవసరమైన పోలీసు సిబ్బందిని నియమించి రథసప్తమి వేడుక రోజున భక్తులకు ఎటువంటి ట్రాఫిక్ అంతరాయం కలుగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. సూర్యనారాయణస్వామి దర్శనం కోసం అధిక సంఖ్యలో భక్తులు రానున్న నేపథ్యంలో సామాన్య భక్తులకు ఇబ్బంది లేకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని అధికారులకు దిశానిర్దేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో ఎస్పీతో పాటు ట్రాఫిక్ డీఎస్పీ సీహెచ్‌జీవీ ప్రసాదరావు, ఎస్బీ డీఎస్పీ ఎస్.బాలరాజు, సీఐలు లెంక సన్యాసినాయుడు, ఎస్.వి.రమణ, ఎస్సై బలివాడ గణేష్ పాల్గొన్నారు.

పలాస ఉపాధ్యాయుడికి అరుదైన అవకాశం



విశాఖ ఆల్‌ఇండియా రేడియోలో మాట్లాడుతున్న నాగేశ్వరరావు మాస్టారు

కాశీబుగ్గ: పలాస మండలం లొద్దబద్ర ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గొర్లె నాగేశ్వరరావుకు అరుదైన అవకాశం లభించింది. ఆల్ ఇండియా రేడియోలో ప్రత్యేక కార్యక్రమ నిర్వహణ కోసం ప్రధాన వక్తగా ఆయన హాజరయ్యారు. అరగంట పాటు గాంధీజీపై మాట్లాడారు. ఈ కార్యక్రమం 29న ఆల్ ఇండియా రేడియోలో ప్రసారం కానుంది.

నెట్‌బాల్ పోటీల్లో సిక్కోలు జట్టుకు మూడో స్థానం



తృతీయ స్థానంలో నిలిచిన నెట్‌బాల్ జట్టు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఏపీ రాష్ట్ర స్కూల్‌గేమ్స్ నెట్‌బాల్ పోటీల్లో సిక్కోలు బాలికల జట్టు సత్తాచాటింది. నెల్లూరు జిల్లా ఆత్మకూరు జెడ్పీహెచ్‌స్కూల్ వేదికగా ఈ నెల 21 నుంచి 23వ తేదీ వరకు ఏపీ స్కూల్‌గేమ్స్ అండర్-17 బాలబాలికల నెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలు జరిగాయి. ఇందులో శ్రీకాకుళం జిల్లా బాలికల జట్టు మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకాన్ని సాధించారు. జట్టుకు కోచ్ మేనేజర్లగా డి.నాగరాజు (జెడ్పీహెచ్‌స్కూల్ కణితీరు), బి.శ్యామలరావు (జెడ్పీహెచ్‌స్కూల్ ఈదుళ్లవలస), కె.జానకి (ఏపీ మోడల్ స్కూల్ పాతపట్నం) వ్యవహరించారు. జిల్లా జట్టు ప్రతిభపై డీఈవో గార పగడాలమ్మ, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్, కార్యదర్శి పి.సుందరరావు, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ బీవీ రమణ, గ్రిగ్స్ సెక్రటరీ కె.మాధవరావు, జిల్లా పీఈటీ సంఘ నాయకులు ఎంవీ రమణ హర్షం వ్యక్తం చేశారు.

పోలీసు కుటుంబాలకు అండగా ఉంటాం



చుక్కారావు కుటుంబ సభ్యులకు చెక్కులు అందజేస్తున్న ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైమ్: విధి నిర్వహణలో ఉంటూ మరణించిన పోలీసు కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని ఎస్పీ జి.ఆర్.రాధిక భరోసా ఇచ్చారు. జిల్లా పోలీసు శాఖలోని ఆర్మడ్ రిజర్వుడు విభాగంలో పని చేస్తూ చనిపోయిన కానిస్టేబుల్ జి.చుక్కారావు, క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ మరణించిన కానిస్టేబుల్ బి.అప్పలనాయుడుల కుటుంబ సభ్యులను జిల్లా పోలీసు కార్యాలయానికి సోమవారం పిలిపించి ఎస్పీ చేతుల మీదుగా ఆర్థిక సాయం చెక్‌లు అందజేశారు. విడోఫండ్, ఫ్లాగ్ ఫండ్‌లతో కలిపి ఒక్కో కుటుంబానికి రూ. 75 వేల చెక్కును ఇచ్చారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన ఇతరత్రా బెనిఫిట్స్ త్వరితగతిన అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీ ఎస్.బాలరాజు పాల్గొన్నారు.

30 నుంచి కమ్మసిగడాం జాతర



ట్రాఫిక్ నియంత్రణపై కమిటీ ప్రతినిధులతో చర్చిస్తున్న ఎస్సై రాజేష్

రణస్థలం: కమ్మసిగడాం మహాలక్ష్మి తల్లి జాతర ఈ నెల 30, 31, ఫిబ్రవరి ఒకటో తేదీల్లో జరగనుంది. దీంతో జాతర ఏర్పాట్లను జె.ఆర్.పురం ఎస్సై జి.రాజేష్ సోమవారం పరిశీలించి ట్రాఫిక్ నియంత్రణపై నిర్వాహకులతో చర్చించారు. రామతీర్థాలు వైపు నుంచి వచ్చే వాహనాలను కమ్మసిగడాం జంక్షన్ ముందు, రణస్థలం వైపుగా వచ్చే వాహనాలను లోచర్లపాలెం కూడలి, దేవరాపల్లి వైపు నుంచి వచ్చే వాహనాలను వెల్బురాయి మిల్లు వద్ద పార్కింగ్ చేసేలా ఏర్పాట్లు చేస్తున్నామని ఎస్సై చెప్పారు. జాతరలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు చర్యలు చేపడతామన్నారు. సీఐ ఆదాం పర్యవేక్షణలో ట్రాఫిక్ నియంత్రణ, భద్రత ఏర్పాట్లు చేస్తున్నట్టు వివరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి ఎస్.ఈశ్వరరావు, ఉపాధ్యక్షుడు వెలిచేటి రామకృష్ణ, సభ్యులు వెలిచేటి రాయుడు, తేజ, గోపిన కృష్ణరావు, నడుకుదిటి గిరి ఉన్నారు.

కిడ్నీ రోగులకు వరం రీసెర్చ్ కేంద్రం



సభలో మాట్లాడుతున్న మంత్రి సీదిరి అప్పలరాజు

● మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు

వజ్రపుకొత్తూరు: పలాసలో నిర్మిస్తున్న కిడ్నీ రీసెర్చ్ కేంద్రం, 200 పడకల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి రోగులకు వరమని మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. అమలపాడు గ్రామంలో సోమవారం నిర్వహించిన 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు. ఉద్దానం ప్రజలను వణికిస్తున్న కిడ్నీ వ్యాధులకు శాశ్వత పరిష్కారం ప్రభుత్వం చూపించిందన్నారు. మరో మూడు నెలల్లో పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొచ్చేలా పని చేస్తున్నామన్నారు. దీనికి కొనసాగింపుగా రూ.700 కోట్లుతో నిర్మిస్తున్న శుద్ధజల పథకం పనులు కూడా చేపడుతున్నట్టు మంత్రి చెప్పారు. హిరమండలం వద్ద వంశధార రిజర్వాయర్‌లో హెడ్‌వర్క్స్ నిర్మించి మెళియాపుట్టి వద్ద నీటిని శుద్ధి చేసే ప్లాంట్ల నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. పలాస నియోజకవర్గంలో గ్రౌండ్ లెవిల్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లు నాలుగు, ఇచ్ఛాపురంలో ఐదు నిర్మించి ప్రతీ గ్రామంలో నిర్మించిన ఓవర్ హెడ్ ట్యాంక్‌లకు నీటిని సరఫరా చేసి ఇంటింటికీ కుళాయి ద్వారా శుద్ధ జలాలు అందిస్తామన్నారు. ఏప్రిల్ నెలలోగా ఈ రెండు ప్రాజెక్టులు అందుబాటులోకి వస్తాయన్నారు. ఉద్దానంలో కొత్తగా ఎక్కడా కిడ్నీ కేసులు నమోదు కాకుండా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అడుగులు ముందుకు వేస్తున్నారని మంత్రి అన్నారు.

బీసీల ఆరాధ్యదైవం సీఎం జగన్

● కళింగవైశ్య కార్పొరేషన్ చైర్మన్ సూరిబాబు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ఏపీలో బీసీ వర్గాలకు న్యాయం జరుగుతోందని కళింగవైశ్య కార్పొరేషన్ చైర్మన్ అందవరపు సూరిబాబు అన్నారు. 139 బీసీ కులాలను గుర్తించి బీసీల ఆరాధ్యదైవంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చరిత్రలో నిలిచిపోతారన్నారు. కార్పొరేషన్ చైర్మన్ పదవీ కాలాన్ని రెండేళ్లు పొడగిస్తూ ఉత్తర్వులు జారీ చేయడంపై సోమవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. రాష్ట్రంలో 50 శాతం బీసీ, ఎస్టీ, ఎస్సీ, మైనారిటీలకు నామినేటెడ్ పోస్టుల్లో, వర్క్‌ల్లో సముచిత స్థానం కల్పించి దార్శనికుడుగా ముఖ్యమంత్రి బీసీల హృదయాల్లో సుస్థిరస్థానం సంపాదించుకుంటున్నారన్నారు. మహిళలపట్ల ఎంతో గౌరవంతో వ్యవహరిస్తూ మేనిఫెస్టోలో చెప్పిన విధంగా రాజకీయాల్లో, సంక్షేమ పథకాలతో పాటు అన్ని రంగాల్లో 50 శాతం తగిన అవకాశాలు కల్పిస్తున్నారన్నారు. నాలుగున్నర లక్షల మంది ఉన్న కళింగవైశ్యులు, 50 వేల మంది భేరివైశ్యులకు కార్పొరేషన్‌ను ఏర్పాటుచేసి తమ కులంపై అభిమానం చాటుకున్నారన్నారు. జగనన్న ప్రభుత్వాన్ని కాపాడుకోవాల్సిన అవసరం మనందరిపై ఉందన్నారు. పదవిని అప్పగించడంతో పాటు పదవీకాలం పొడిగించేందుకు సహకరించిన వైఎస్సార్‌సీపీ రాజ్యసభ సభ్యుడు వి.విజసాయి రెడ్డి, ప్రభుత్వ సలహాదారులు సజ్జల రామకృష్ణారెడ్డి, స్పీకర్ తమ్మినేని సీతారాం, మంత్రులు ధర్మాన ప్రసాదరావు, బొత్స సత్యనారాయణ, చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, సీదిరి అప్పలరాజు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.

ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): శిష్టకరణ కార్పొరేషన్ చైర్మన్, 11 మంది డైరెక్టర్ల పదవీ కాలాన్ని రెండేళ్లు పొడిగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంపై సంఘ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహరెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. తమను గతంతో బీసీ జాబితాలో చేర్చిన ఘనత దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డికి దక్కగా.. ఇప్పుడు అతను కుమారుడు.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలియజేసిన వారిలో సంఘ అధ్యక్షుడు పి.ఉమామహేశ్వరావు, సంఘ ఏపీ జాయింట్ సెక్రటరీ యు.రాధాకృష్ణన్, డాక్టర్ శ్రీనివాస్ పట్నాయక్ ఉన్నారు.

11, 12 తేదీల్లో జాతీయ శిష్టకరణ సంఘ సమావేశం



సమావేశం విజయవంతం చేయాలని కోరుతున్న సంఘ నాయకులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): హైదరాబాద్‌లో ఫిబ్రవరి 11, 12 తేదీల్లో జాతీయ శిష్టకరణ సంఘ సమావేశం జరగనుందని రాష్ట్ర అధ్యక్షుడు పోలుమహంతి ఉమామహేశ్వరరావు తెలిపారు. సమావేశానికి పెద్ద సంఖ్యలో శిష్టకరణ సంఘ శ్రేణులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ మేరకు సోమవారం నగరంలోని ఓ ప్రైవేటు హోటల్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సంఘ జాతీయ అధ్యక్షుడు డబ్బీరు వేంకట కృష్ణారావు ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో ఉన్న డాక్టర్ చెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రంలో జరగనున్న సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకుంటామన్నారు. పలు రంగాల్లో నిష్ణాతులైన శిష్టకరణ ప్రముఖులను జీవిత సాఫల్య అవార్డులతో సత్కరించనున్నట్టు పేర్కొన్నారు. పలు రాష్ట్రాల నుంచి సుమారు 500 మంది డెలిగేట్స్ హాజరవుతారన్నారు. అలాగే ఏప్రిల్ ఆరో తేదీలోగా చలో ఢిల్లీ కార్యక్రమాన్ని ఖరారు చేసి ఓబీసీ జాబితాలో తమ సామాజిక వర్గాన్ని చేర్చేందుకు కృషి చేస్తామన్నారు.

సమావేశంలో శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు బలివాడ మల్లేశ్వరరావు, కార్యదర్శి డబ్బీరు వాసు, కోశాధికారి ఉరిటి కిరణ్ బాబు, బెహరా రామచంద్రరావు, కళ్లేపల్లి వెంకటేశ్వరరావు, ఏపీ విజయనారాయణ, డాక్టర్ శ్రీనివాస పట్నాయక్, శ్రీరామ్ కుమార్, డబ్బీరు వెంకట్రావు, మణి పాత్రుని జోగారావు, సదాశివుని కృష్ణ, పొన్నాడ మోహన రావు పాల్గొన్నారు.

యాంత్రీకరణపై రైతులకు అవగాహన అవసరం

● వ్యవసాయ శాస్త్రవేత్త జగన్నాథం



సమావేశంలో మాట్లాడుతున్న పి.వి.కె. జగన్నాథం

ఆమదాలవలస: వ్యవసాయ రంగంలో యాంత్రీకరణ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించాలని అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్ డాక్టర్ పి.వి.కె.జగన్నాథం అన్నారు. ఆ దిశగా రైతులను సన్నద్ధం చేయాల్సిన బాధ్యత వ్యవసాయశాఖ సిబ్బంది, కేవీకే శాస్త్రవేత్తలపై ఉందన్నారు. ఆమదాలవలస కృషి విజ్ఞాన కేంద్రంలో కోఆర్డినేటర్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి అధ్యక్షతన సోమవారం 41వ శాస్త్రీయ సలహా మండలి సమావేశం జరిగింది. తొలుత కేవీకేలో క్షేత్రస్థాయి పరిశీలన జరిపారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. చెరుకు పంట, బెల్లం తయారీలో నాణ్యత కలిగిన నవీన్ రకాన్ని రైతులు వినియోగించేలా చూడాలన్నారు. యాంత్రీకరణపై రైతులకు శిక్షణ కార్యక్రమాలను చేపట్టాలన్నారు. గుంటూరు అగ్రులాం డీడీ డాక్టర్ విశాలక్ష్మి మాట్లాడుతూ.. ఈ సంవత్సరం అంతర్జాతీయ తృణధాన్యాల సంవత్సరంగా గుర్తించినట్టు చెప్పారు. కొర్ర, రాగి, సజ్జలు, జొన్నలకు సంబంధించి నూతన వంగడాలను విస్తరింపజేయాలన్నారు. అటారి సాంకేతిక విస్తరణ ప్రధాన శాస్త్రవేత్త ఎ.ఆర్.రెడ్డి మాట్లాడుతూ.. కె.వి.కె. చేస్తున్న సాంకేతిక విస్తరణ రైతులలో ఎలాంటి ప్రభావం చూపిస్తుందో అధ్యయనం చేయాలన్నారు. శ్రీకాకుళం ఏడీఏ డాక్టర్ బి.రజని మాట్లాడుతూ.. ఈ ఏడాది అంతర్జాతీయ తృణధాన్యాల సంవత్సరం సందర్భంగా శ్రీకాకుళం వారు 200 సమూహాలలో రాగి విత్తనాలను సరఫరా చేసి తృణధాన్యాల సాగును ప్రోత్సహిస్తున్నారన్నారు. కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్, శాస్త్రవేత్తలు గత ఏడాదిలో నిర్వహించిన కార్యక్రమాలు, ఈ ఏడాదిలో ఏం చేయాలనుకుంటున్నారో వివరించారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో చేపట్టాల్సిన కార్యక్రమాల ప్రణాళికను సమావేశంలో ఆమోదించారు. వరిలో సమగ్ర సస్యరక్షణలో సౌరశక్తితో నడిచే దీపపు ఎర ప్రాముఖ్యత, చేప ఉత్పత్తులు, తాజాగా ఉంచేందుకు మార్కెట్‌స్థాయిలో తీసుకోవలసిన జాగ్రత్తలపై వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. సమావేశంలో ఆమదాలవలస వ్యవసాయపరిశోధనస్థానం, డాట్ సెంటర్ల శాస్త్రవేత్తలు భగవాన్, సత్యన్నారాయణ, జగన్నాథం, శ్రీలత, ఎన్‌జీవో సన్యాసిరావు, భూదేవి, సంజీవరావు, తిరుమలరావు పాల్గొన్నారు.